# రావు సాహేబ్ సన్నయ్య



వై. విఠలరావు

★

సన్నయ్యంటే ఆ వూళ్లో పెద్ద అసామీ అని పేరు. భూఖామందు ఏదో యింత యింగ్లీషు తెలిసినవాడు. వయసువచ్చిందిమొదలు పెద్ద చదువు చదువుకోకపోయినా పిత్రార్జితము కని పెట్టుకుని. పంచాయితీబోర్డు ప్రెసిడెంటంటే, కోఆపరేటివ్‌బ్యాంకు ప్రెసిడెంటంటే. యిత్యాదుల స్థానమలంకరించి గౌరవము సంపాదిస్తూ ఉంటాడు ఒక ఘడియ వూరకేవుండడానికి యిష్టపడేవాడు కాడు. ఎక్కడైనా ప్రభుత్వంతరఫున మీటింగుగాని, ఉత్సవంగాని జరుగుతే మన సార దానిని జయప్రదంగా జరపడానికి పూనుకునేవాడు. ఇదంతా యింకా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకపూర్వపురోజులు.

ఎవరైనా చందాకోసమువస్తే, ఎందుకిపుడు అని ప్రశ్నవేసి సంతుష్టిపడితేనేగాని యిచ్చేవాడు కాడు. అదే ప్రభుత్వపు ఉద్యోగివచ్చి అడిగితే వెంటనే యిచ్చేవాడు. ప్రభుత్వానికి యీ సంగతి తెలిస్తే మెచ్చుకుంటారని. నాన్ కోఆపరేషన్ రోజులలోనూ, ఉప్పు సత్యాగ్రహం రోజులలోనూ. చక్రవర్తి జన్మదినోత్సవంజరిపి, యీ సం/తి ప్రభుత్వము మెచ్చుకుంటారని వారికి లేఖారూపమున తెలిపి వారివల్ల కృతజ్ఞతాభివందనాలుపొంది సంతుష్టిపడేవాడు. ప్రతి వాళ్ళకి యీమాత్రం, అమాత్రం ప్రభుత్వానికి పనిచేస్తే. ఏదో బిరుదు తగిలిస్తున్నారే? తనకే బిరుదూ రాలేదేయని ఖిన్నుడయేవాడు.

సరే! వార్ ఫండురోజులు వచ్చాయి. ఇప్పుడేమైనా కష్టపడితే వచ్చినట్టు లేకపోతే లేనట్టు. కనుక విశ్వప్రయత్నముచేసి ఫండు చేకూర్చడానికి ప్రయత్నించేడు. ఏదో కొంత యేర్పడ్డది. అది ఇరసాలు చెల్లించేడు.

తరువాత అతని యానందమేమని చెప్పవచ్చును. చక్రవర్తి జన్మదిన బిరుదులలో 'రావు సాహేబ్ సన్నయ్య' అని పడింది. బలే! రొట్టె నేతిలో పడిందని అనుకున్నాడు. జన్మసాఫల్యమైందనుకున్నాడు. అతని స్నేహితులు చాల ఆనందించారు

యుద్ధమైంది. రాజకీయ సంప్రదింపులైనాయి. భారతరాజ్యాంగపరిస్థితిలో విప్లవం పోయి మార్పు ఏర్పడింది శాంతియుతంగా ప్రజాస్వామ్యప్రభుత్వము. అధినివేశ స్వాతంత్ర్యము ఏర్పడబోతూంది కేంద్రప్రభుత్వమువారు, స్వాతంత్ర్యదినమున ఆగష్టు 15-వ తేదీనుండి బిరుదులేమి చెల్లవు అన్నారు. వెంటనే శ్రీ అల్లాడి కృష్ణస్వామి అయ్యరు శ్రీ సి ఆర్. రెడ్డి వగైరాలు బిరుదులు వదులుకున్నారు. ఆ విషయమై ప్రకటించారు.

సన్నయ్య ఏంచేస్తాడో! మష్టకానికి కొన్ని సంవత్సరాలైనా కాలేదు, అదివచ్చి. చాలమంది బిరుదులువచ్చినతర్వాత వాటిని 20, 30 సంవత్సరాలు అనుభవించారు. పాపము! అదీ జాతకమహిమ! అయితే అతడుకూడ స్వాతంత్ర్యదినమున, తరువాత ఆ బిరుదునేబరువుని వదిలేసి స్వేచ్ఛగా తనపేరుకు తగ్గట్టుగా గర్వంలో సన్నగావుంటాడని ఆశ!